
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 2 । సెప్టెంబర్ । 2023



నేడు గండిలో శ్రావణమాస ఉత్సవం

శ్రావణ మాసంలో గండి క్షేత్రంలో శనివారం ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. -IIలో..



ఆ ఇంట..మృత్యుఘోష

ఆ కుటుంబంలో ఏం జరుగుతోంది? ఉరి వేసుకుని కుమారుడు.. అతడి జ్ఞాపకాలతో తల్లి.. ఆపై తండ్రి దుర్మరణం చెందడం స్థానికులను కలచి వేస్తోంది. —IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
36.5/27.4

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.4 – 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

లబ్ధిదారులకే లీజు హక్కు

కడప రూరల్: జడ్‌హెచ్‌డీసీ భూములు కేటాయించిన లబ్ధిదారులకు మాత్రమే లీజు హక్కు ఉంటుందని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్ వెంకటసుబ్బయ్య తెలిపారు. గతంలో నిబంధనల ప్రకారం జడ్‌హెచ్‌డీసీ ద్వారా లీజుకు కేటాయించిన లబ్ధిదారులు మాత్రమే భూములను సాగు చేసుకోవాలన్నారు. వారు మాత్రమే కౌలు దారులుగా హక్కులు కలిగి ఉంటారని తెలిపారు. సంబంధం లేని వారు ఈ భూములను సాగు చేయడం, కౌలు చేసుకోవడానికి వీలు లేదని పేర్కొన్నారు. లీజు హక్కు దారులకు ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో మూడు రైల్వే జంక్షన్లు

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో మూడు స్టేషన్లను రైల్వే జంక్షన్లుగా మారుస్తూ రైల్వే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కడప, ఎర్రగుంట్ల, ఓబులవారిపల్లి స్టేషన్లు ఇక రైల్వే జంక్షన్లుగా మారనున్నాయి. ఒకటి కంటే ఎక్కువ రైల్వే లైన్లు ఉన్న ప్రాంతాన్ని జంక్షన్లుగా పిలుస్తారు. ఈ మూడు రైల్వే స్టేషన్లు రెండు రైల్వే లైన్లు ఉండడంతో ఈమేరకు ఉత్తర్వులు జారీ చేశారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్ తెలిపారు.

ధర్మవరం-మచిలీపట్నం రైలు దారి మళ్లింపు

కడప కోటిరెడ్డి సర్కిల్: ముద్దనూరు-మంగపట్నం స్టేషన్ల మధ్య నాన్ ఇంటర్ లాంకింగ్ పనులు జరుగుతుండడంతో ధర్మవరం-మచిలీపట్నం రైలును దారి మళ్లించారని కడప రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మచిలీ పట్నం-ధర్మవరం (17215) రైలు ఈనెల 4, 5 తేదీల్లో నంద్యాల, డోన్, గుత్తి, ధర్మవరం మీదుగా నడవనుందన్నారు. అలాగే ధర్మవరం-మచిలీపట్నం (17216) రైలు ఈనెల 5, 10 తేదీల్లో ఇదే మార్గంలో నడుస్తుందన్నారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక




హరిమధుసూదన్‌రావు రాఘవేంద్రమ్మ

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌జిల్లా మైలవరం మండలం దొమ్మరనంద్యాల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో సోసియల్ సబ్జెక్టు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె. హరి మధుసూదన్ రావు, లింగాల మండలం గుణకనపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం. రాఘవేంద్రమ్మలు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయారు. ఈ నెల 5వ తేదీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు. జిల్లా నుంచి ఇద్దరు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

108 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వైవీయూ ఆరోగ్యకేంద్రంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, వ్యవస్థాపక వీసీ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ఏర్పాటులోనూ, అభివృద్ధిలోనూ దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి అందించిన సహకారాన్ని, సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు 108 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎస్. వెంకటరామిరెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య పి. చంద్రమతీశంకర్, ఆచార్య సి. నాగరాజు, డా. మాదక్క, డా. వై. ప్రమోద, వైద్యాధికారి నరేష్ కుమార్‌రెడ్డి, రిమ్స్ వైద్యబృందం, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి మది మందిరమే!

- ఇప్పటికీ తలచుకొని మదనపడుతున్న ప్రజానీకం
- వైఎస్ హయాంలో జిల్లాలో సంక్షేమం, అభివృద్ధి
- జలయజ్ఞంతో మెట్ట ప్రాంతాలకు కృష్ణా జలాలు
- నేడు వైఎస్ 14వ వర్ధంతి
- వాడవాడలా సేవా కార్యక్రమాలకు సన్నాహాలు



ప్రొద్దుటూరులోని శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్న పెనుగొండ రామశేషయ్య లారీ డ్రైవర్. ముగ్గురు కుమార్తెలు, అందరూ పనికి వెళ్తేగానీ పూట గడవని పరిస్థితి. 2008లో రామశేషయ్యకు గుండె నొప్పి రావడంతో కుప్పకూలిపోయారు. ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్లగా గుండెపోటు అని నిర్ధారించారు.ఆపరేషన్ చేయించాలన్నారు. చేతిలో చిల్లిగవ్వకూడా లేకపోవడంతో ఏమి చేయాలో పాలుపోలేని స్థితి.వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం కింద తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో ఉచితంగా గుండె ఆపరేషన్ చేశారు. ఎన్ని జన్మలెత్తినా వైఎస్సార్ రుణం తీర్చుకోలేమని రామశేషయ్య అంటున్నారు.



ఆదినారాయణరెడ్డి




వెంకటసుబ్బమ్మ

ప్రొద్దుటూరులోని సంజీవనగర్‌లో నివాసం ఉంటున్న చౌటపల్లె ఆదినారాయణరెడ్డి దంపతులకు 2008లో ఒకే నెలలో ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేశారు. ఏప్రిల్‌లో ఆయనకు గుండెపోటు రావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక వైద్యం చేసి వెంటనే హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడి మెడిసిటి హాస్పిటల్‌లో ఆపరేషన్ చేసి స్టంట్ వేశారు. నేను ఆరోగ్యంగా ఉన్నానంటే వైఎస్సార్ పెట్టిన భిక్షేనని ఆదినారాయణరెడ్డి చెబుతున్నారు. అదే నెలలో వెంకటసుబ్బమ్మకు ఆరోగ్యశ్రీ కింద థైరాయిడ్ ఆపరేషన్ జరిగింది. ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయడంతో భార్యాభర్తలు ఇప్పుడు సంతోషంగా ఉన్నారు.

సాక్షి ప్రతినిధి కడప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన ప్రభుత్వ పథకాలు ఇప్పటికీ, ఎప్పటికీ మరువరానివి. ఫీజురీయింబర్స్‌మెంటు పథకం పేదల తలరాతలు మార్చివేసింది. అనారోగ్యపాలైతే వల్లకాడే దిక్కుగా ఉన్న పేదలకు ఆరోగ్యశ్రీ పథకంతో పునర్జన్మ కల్పించింది. ఇళ్లు లేని నిరుపేదలందరికీ గూడు కల్పించి వైఎస్సార్ వారి పాలిట కల్పవృక్షంలా నీడనిచ్చారు. అణగారిన వర్గాల ఉన్నతి కోసం రిజర్వేషన్లు కల్పించి చరిత్రను తిరగరాశారు. అరుగాలం శ్రమించినా ఫలితం దక్కని రైతన్నకు దన్నుగా నిలిచారు. వృద్ధులకు పెద్ద కొడుకుగా, వితంతువులకు సోదరుడిగా... ఇలా చెప్పుకుంటూపోతే ఐదేళ్ల పాలనలో అన్ని వర్గాలకు ఏదో ప్రయోజనం కల్పించిన ఘనత ఆయన సొంతమైంది. ఓవైపు పన్నులు లేకుండా మరోవైపు సంక్షేమ పాలన చేపట్టి, ప్రభుత్వ పాలనంటే ఇలా ఉండాలని భవిష్యత్ తరాలకు ఆయన ఆదర్శప్రాయుడుగా నిలిచారు. వెరసి ప్రతి హృదయము మందిరమే అయ్యిందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

అరుదైన నాయకుడు....

అచ్చతెలుగుదనం ఉట్టిపడే పంచెకట్టు, నడకలో ఠీవి, నమ్ముకున్న వారిని ఆదరించేగుణం, మాట తప్పని.. మడమ తిప్పని నైజం, అన్నదాతలు, కార్మిక, కర్షకుల కోసం పరితపించే గుణం, వీటన్నింటికీ మించి మోముపై చిరునవ్వు... ఈ లక్షణాలన్నీ కలగలిపి పుణికి పుచ్చుకున్న నాయకుడు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. అనంతపురం నుంచి అదిలాబాద్ వరకూ, శ్రీకాకుళం నుంచి చిత్తూరు దాకా ఆ పేరు ఉచ్ఛరిస్తేనే మనస్సు పులికిస్తుంది. అందుకు కారణం రాజకీయాలకు అతీతంగా పేదలను ప్రేమించడం, వర్గాలకు, పార్టీలకు, ప్రాంతాలకతీతంగా సమగ్రాభివృద్ధి చేయాలనే తపన ఉండడం. ప్రజల కోసం, ఎంతటి కష్టాన్నైనా భరించి సంక్షేమ పాలన చేపట్టడం. దాంతో మరుపురాని జ్ఞాపకంగా ప్రజానీకం గుండెలోతుల్లో కొలువయ్యారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి శనివారం ప్రజానీకం ఘనంగా చేపట్టేందుకు సన్నహాలు చేసుకున్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు.



తండ్రిని మించి ఆరోగ్యశ్రీ అమలు...

పేదల మదిలో వైఎస్ రాజశేఖరరెడ్డి సుస్థిర స్థానం సంపాదించారు. నేను సైతం పేదల పక్షపాతినేని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుజువు చేశారు. తండ్రి కంటే రెండు అడుగులు ముందుంటానని స్వతహాగా వెల్లడించిన ఆయన ఆరోగ్యశ్రీని మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టారు. 3,255 రోగాలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పరిధిలోకి తీసుకొచ్చారు. రూ.5లక్షల వరకు ఆదాయం ఉన్న కుటుంబాలను సైతం ఆరోగ్యశ్రీ పథకంలోకి వర్తించేలా పథకాన్ని రూపొందించారు. మరోవైపు ఆరోగ్య ఆసరా పథకాన్ని తీసుకొచ్చారు. జబ్బుల బారిన పడిన వారి జీవనానికి ఎలాంటి ఆటంకం తలెత్తకుండా రోజుకు రూ.225 చెల్లించేలా పథక రచన చేశారు. ఇప్పటి వరకూ జిల్లాలో రూ.550 కోట్లు వ్యయం భరించి 2.6లక్షల మందికి వివిధ వైద్య సేవలు ఉచితంగా అందించారు. ఆరోగ్య ఆసరా ద్వారా 1.2లక్షల మందికి సుమారు రూ.58 కోట్లు పైగా అందజేశారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి విశేష కృషి

డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యే వరకు పాలకుల వివక్షతతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన కడప జిల్లా ఐదేళ్ల వైఎస్ హయాంలో సమగ్రాభివృద్ధి సాధించింది. ఉన్నత విద్య అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యోగి వేమన యూనివర్సిటీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్, పశువైద్య విద్య కళాశాలలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆస్పత్రి, దంత వైద్యశాల నిర్మించారు. ట్రిపుల్ ఐటీ, ఐజీ కార్ల్ (పశు పరిశోధన కేంద్రం), దాల్మియా సిమెంటు కర్మాగారం, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్, భారతి సిమెంటు కర్మాగారం, సజ్జల పాలిమర్స్ లాంటి పరిశ్రమలను నెలకొల్పారు. జలయజ్ఞం ద్వారా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలను పరుగులు పెట్టించారు. సుమారు రూ. 12 వేల కోట్లతో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేశారు. గాలేరు-నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలను వైఎస్సార్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునీకరణ, సర్వారాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, పైడిపాళెం, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాదే తెలుగుగంగ పనులను పూర్తి చేసి కృష్ణా జిల్లాలతో బ్రహ్మంసాగర్‌లో నింపి ఘనత సాధించారు. మెట్ట ప్రాంతాలల్లో కృష్ణా జలాలు పారుతున్నాయంటే అది ఆనాటి వైఎస్సార్ చలువే. ఎవరు ఏది అడిగినా కాదనకుండా అభయమిచ్చారని జిల్లావాసులు ఇప్పటికీ కొనియాడుతున్నారు.

పింఛనానందం

జిల్లాలో 2,58,041 మందికి
రూ.71.48 కోట్లకు పైగా పంపిణీ

కడప రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుక కింద జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 2,58,041 మందికి మొత్తం రూ 71,48,06,750 పంపిణీకి చర్యలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే వలంటీర్లు నగదు పంపిణీని చేపట్టారు. ఒకటో తేదొచ్చింది...ఠంచన్‌గా పింఛన్ వచ్చిందని అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం...



ఇక్కడ పింఛన్ వితంతు పింఛన్ తీసుకుంటున్న మహిళ పేరు రాధ. కడప నగరం కాగితాలపెంట వాసి. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ బాను వచ్చి పింఛన్‌ను అందజేసింది. దీంతో రాధ సంతోషం వ్యక్తం చేసింది. వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి పింఛన్‌లు అందజేయడం సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వానికి రుణ పడి ఉంటామని రాధ తెలిపింది.

ఇది సంక్షేమ ప్రభుత్వం...



ఈ ఫోటోలో ఒంటరి మహిళ పింఛన్ అందుకుంటున్న లబ్ధిదారువాలి పేరు రజని. కడప మరియాపురంలో ఉంటోంది. ఉదయాన్నే ఆ ప్రాంత వలంటీర్ రాజ్యలక్ష్మి పింఛన్ నగదును అందజేసింది. నగదును అందుకున్న రజని ఇది సంక్షేమ ప్రభుత్వం..పేదలకు అండగా నిలిచే ప్రభుత్వం అని చెపింది.

ఇడుపులపాయకు చేరుకున్న వైఎస్ షర్మిల, వైఎస్ విజయమ్మ

వేంపల్లి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించేందుకు ఆయన కుమార్తె వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, సతీమణి వైఎస్ విజయమ్మలు శుక్రవారం సాయంత్రం ఇడుపులపాయకు చేరుకున్నారు. రాత్రికి ఇడుపుల పాయలోని వైఎస్ఆర్ అతిథి భవనంలో వారు బసచేశారు. శనివారం ఉదయం 8గంటలకు వారు దివంగత నేత సమాధి వద్దకు చేరుకుని నివాళులు అర్పిస్తారు. వారి వెంట వైఎస్ఆర్ సోదరుడు వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ ఉన్నారు.

ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం



వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- వినికిడి యంత్రాల పంపిణీ

కడప కార్పొరేషన్: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్ బి అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో(పాత మున్సిపల్ ఆఫీసు) చెవులు సరిగా వినపడని వారికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పేద ప్రజలకు ఏ ఆరోగ్య సమస్యలు ఉన్న తమ దష్టికి తీసుకొసే పరిష్కార చర్యలు ఉంటామని అన్నారు. కడప నగరం రామరాజు పల్లి కి చెందిన షేక్ బీబీజాన్, సగిలి మేరమ్మ, షేక్ జీవలి, షేక్ మబూ షరీఫ్, అమ్మనమ్మ లు తమకు వినికిడి యంత్రాలు అవసరమని ఉపముఖ్యమంత్రిని ఆశ్రయించగా ఆయన వెంటనే స్పందించి వారికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ మహమ్మద్ షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, ఎన్. సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీఎం వైఎస్ జగన్ జిల్లాకు రాక



కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ విజయరామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇడుపులపాయలో దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు. అందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

ఉదయం

- 9.00 గంటలకు సీఎం తన నివాసం నుంచి బయలుదేరి 9.20 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 9.30 గంటలకు విమానంలో బయలుదేరి 10.20 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 10.30 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.50 గంటలకు ఇడుపులపాయలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.00 గంటలకు వైఎస్సార్‌ఘాట్ వద్దకు చేరుకుంటారు.
- 11.05 గంటల నుంచి 11.25 గంటల వరకు ఘాట్ వద్ద నివాళులర్పిస్తారు. ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు.
- 11.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11.35 గంటలకు వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు.
- 11.35 నుంచి 12.05 గంటల వరకు రిజర్వు
- మధ్యాహ్నం 12.10 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి 12.15 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 12.15 నుంచి 12.30 గంటల వరకు స్థానిక నాయకులతో ముచ్చటిస్తారు.
- 12.35 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 12.55 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.
- 1.00 గంటకు కడప నుంచి విమానంలో బయలుదేరి 1.50 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 2.00 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 2.20 గంటలకు తన నివాస గృహానికి చేరుకుంటారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు వస్తున్నందున ఏర్పాట్లు పకడ్బందీగా చూడాలని కలెక్టర్ విజయ రామరాజు ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన స్వయంగా ఏర్పాట్లను పరిశీలించారు. కడప ఎయిర్ పోర్ట్, ఇడుపుల పాయ ఎస్టేట్‌లో హెలిప్యాడ్, వైఎస్ఆర్ ఘాట్ ప్రాంగాణాల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ అన్బు రాజన్, జేసీ గణేష్ కుమార్,అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్‌లు ఆయన వెంట పాల్గొన్నారు. ఇడుపుల పాయ ఎస్టేట్, ముఖ్యమంత్రి పర్యటనలో ఉన్న వారందరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుధ్య పనులు పక్కాగా ఉండాలని, అలాగే తాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కడప ఎయిర్ పోర్టు, ఇడుపులపాయ హెలిప్యాడ్, గెస్ట్ హౌస్ వద్ద, వైయస్సార్ ఘాట్ వద్ద ప్రోటోకాల్ మేరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. శనివారం గండి క్షేత్రానికి దర్శించేందుకు వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని పార్కింగ్ అంశాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పాడా ఓఎస్డీ అనిల్ కుమార్ రెడ్డి, పులివెందుల ఆర్డీఓ వెంకటేశం, జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, కడప మేయర్ సురేష్‌బాబు

- రైతు భరోసా కింద 1767 మందికి రూ. 1,32,52,500
- ఇన్‌ఫుట్ సబ్సిడీ కింద 1,435 మందికి రూ. 2,02,65,375

కడప సెవెన్‌రోడ్స్: రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఐదో ఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా సాయంతోపాటు 2023 మే- జూన్ మాసాలకు సంబంధించి పంటల నష్టానికి ఇన్ పుట్ సబ్సిడీ మొత్తాన్ని అందించింది. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నిధులు రైతుల ఖాతాల్లో జమచేశారు. జిల్లాలో 1767 మంది రైతులకు రూ. 1,32,52,500 'రైతు భరోసా సాయం'తో పాటు 1,435 మంది రైతులకు రూ. 2,02,65,375 ఇన్ పుట్ సబ్సిడీ అందింది. కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, నగర మేయర్ సురేష్‌బాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఐదో ఏడాది మొదటి విడత 'వైఎస్సార్ రైతు భరోసా' సాయాన్ని అందించడం ద్వారా వ్యవసాయంపై రైతుల్లో మరింత మక్కువ పెరిగిందన్నారు. దేశంలోనే తొలిసారిగా కౌలు రైతులతో పాటు దేవదాయ, అటవీ భూములను సాగు చేస్తున్న వాస్తవ సాగుదారులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని వర్తింపచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం 2023-24 సీజన్‌కు సంబంధించి తొలి విడత పెట్టుబడి సాయాన్ని ఒకేసారి రైతులకు అందజేయడం అభినందనీయం అన్నారు. పంట హక్కు సాగు పత్రాలు పొందిన వారిలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కౌలు దారులు, దేవదాయ భూములను సాగు చేస్తున్న రైతులతో పాటు.. దేశంలో ఎక్కడా లేనివిధంగా భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతుల కుటుంబాలతో పాటు దేవదాయ, అటవీ భూమి సాగుదారులకు కూడా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతోనే అందించడం ఆనందదాయక విషయం అన్నారు. అర్హత ఉండీ 'వైఎస్ఆర్ రైతు భరోసా' పథకం లబ్ధి ఇంకను పొందని వారుంటే సంబంధిత వార్డు లేదా గ్రామ వలంటీర్లను, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ ను, మండల వ్యవసాయ అధికారిని గానీ సంప్రదించాలన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు కలెక్టర్, అతిథులు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి నాగేశ్వర రావు, ఉద్యానశాఖ డీడీ రాజీవ్ మైఖేల్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా – యువకుడు మృతి


గౌస్(ఫైల్)

కమలాపురం : కమలాపురం పట్టణ పరిధిలోని జడ్పీ గర్ల్స్ హైస్కూల్ వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో దూదేకుల గౌస్(20) మృతి చెందినట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. బీడీ కాలనీకి చెందిన దస్తగిరి కుమారుడు గౌస్.. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం బాయ్స్ హైస్కూల్‌కు స్నేహితుడు ఆసిఫ్‌తో కలసి ఆటోలో వెళ్తున్నారు. గర్ల్స్ హైస్కూల్ సమీపంలో మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన గౌస్‌ను కమలాపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి తల్లిదండ్రులు దస్తగిరి, గౌసియా, సోదరుడు, సోదరి ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

పులివెందుల రూరల్ : వేల్పుల గ్రామానికి చెందిన స్వప్న, ఆమె కుమారుడు చేతన్‌కుమార్‌రెడ్డితో కలిసి బోడివారిపల్లెకు వెళ్తున్నారు. తుమ్మలపల్లె వైపు వెళ్తున్న ఆటో పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో వీరిని ఢీకొనడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి.

- జమ్మలమడుగు నియోజకవర్గంలోని నవాబ్‌పేటకు చెందిన ఋషికేశవరెడ్డి ద్విచక్ర వాహనంలో పులివెందులకు వెళ్తుండగా ఆటో ఢీకొనడంతో గాయపడ్డారు.
- వల్లూరులో

వల్లూరు : తాడిపత్రి–కడప రహదారిలో తప్పెట్ల రైల్వే వంతెన వద్ద శుక్రవారం యర్రగుంట్ల వైపు నుంచి కడపకు వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

కసాయి తండ్రి అరెస్ట్


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

కమలాపురం : కన్నకొడుకునే కడతేర్చిన కసాయి తండ్రి వీరంరెడ్డి శివశంకర్‌రెడ్డిని అరెస్టు చేసినట్లు కమలాపురం ఇన్‌చార్జ్ సీఐ అశోక్ రెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కమలాపురం మండలం అగస్త లింగాయపల్లెకు చెందిన శివశంకర్‌రెడ్డి ఆగస్టు 30న కత్తితో కుమారుడు చిన్నారి సోమేశ్వర్‌రెడ్డి(11) గొంతు కోసి పరారైన సంగతి విదితమే. 31న నల్లింగాయపల్లె నుంచి రాజుపాళెం దారిలో ఉన్నట్లు తెలియడంతో నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. తనకు పుట్టలేదనే అనుమానంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని సీఐ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్‌ఐ చిన్నపెద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఆ ఇంట.. మృత్యుఘోష

అరు నెలల్లోనే ముగ్గురు మృతి



మదనపల్లె : ఆ కుటుంబంలో ఏం జరుగుతోంది? ముందు ఉరి వేసుకుని కుమారుడు.. అతడి జ్ఞాపకాలతో తల్లి.. ఆపై అనుమానాస్పదంగా తండ్రి దుర్మరణం చెందడం స్థానికులను కలచి వేస్తోంది. ఒకరి వెంట ఒకరు ఆరు నెలల్లో మృత్యువాత పడడంతో వారి కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మండలంలోని కోళ్లబైలు పంచాయతీ కాట్లాటపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి, రమణమ్మ దంపతులకు కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె మనీషా ఉన్నారు. కుమార్తెకు పెళ్లి చేసి అత్తారింటికి పంపారు. ఈ ఏడాది మార్చిలో కుమారుడు కిరణ్‌కుమార్‌రెడ్డి స్వగృహంలో ఉరివేసుకుని మృతిచెందాడు. అతడి మృతిని జీర్ణించుకోలేక బయ్యారెడ్డి కాలనీకి ఓబుల్‌రెడ్డి దంపతులు మకాం మార్చారు. ఆగస్టు 11న ఓబుల్‌రెడ్డి భార్య రమణమ్మ కుమారుడి జ్ఞాపకాలు మరువలేక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుమారుడు, భార్య ఆత్మహత్య చేసుకుని చనిపోవడంతో మద్యానికి బానిసైన ఓబుల్‌రెడ్డి శుక్రవారం ఇంటి బాత్రూమ్ సమీపంలో మృతిచెంది పడి ఉన్నారు. స్థానికులు హత్యగా అనుమానించి, బంధువులకు, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తల వెనుక గాయం ఉండటాన్ని గుర్తించారు. ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఆరు నెలల వ్యవధిలో మృతి చెందడంతో స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. 'తన సోదరుడి కుటుంబానికి కాట్లాటపల్లె వద్ద రూ.3 కోట్ల విలువ చేసే పొలం ఉందని, ఆస్తి కోసం ఎవరైనా హత్య చేశారేమో.. విచారించాలని' మృతుడి సోదరుడు మీడియాకు తెలిపారు.


ఘటనాస్థలంలో అనుమానాస్పద స్థితిలో ఓబుల్‌రెడ్డి మృతదేహం (ఇన్‌సెట్) ఓబుల్‌రెడ్డి (ఫైల్)

నేడు గండిలో మూడో శ్రావణమాస ఉత్సవం

చక్రాయపేట : శ్రావణ మాసంలో గండి క్షేత్రంలో శనివారం ఉత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 3 గంటలకు సుప్రభాతసేవ, ఉత్సవమూర్తులకు అభిషేకం, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఎక్కువమంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశామని ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘువేంద్రప్రసాద్ తెలిపారు. రాత్రి బాలనాగమ్మ, రామాంజనేయ యుద్ధం నాటకాలు, భరత నాట్య ప్రదర్శన ఉంటాయన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతలు అన్నదానం చేస్తారన్నారు. పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసినట్లు ఆర్కే వ్యాలీ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. భారీ వాహనాలను గండిలోకి అనుమతించమన్నారు. వీఐపీలు, పాస్‌లు కలిగిన వారు ఉదయం, సాయంత్రం ఐదు గంటల నుంచి ఎనిమిది గంటలలోగా రావాలన్నారు.


గండి వీరాంజనేయుడు

జెడ్పీలో 3న గురుపూజోత్సవం

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ ప్రవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఆపుస్మ) కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3వ తేదీ ఉదయం 10 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించనున్న ఆపుస్మ కడపజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగయ్య, పీవీ రమణారెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు, జెడ్పీ చైర్మన్ అకేపాటి అమర్‌నాథరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డిలు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీఈఓ రాఘవరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లాల్లోని ప్రవేటు పాఠశాలల్లో పనిచేస్తూ ప్రతిభ కనబరుస్తున్న 100 మంది ప్రైవేటు టీచర్లకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు.

వైవీయూలో పాలకమండలి సభ్యులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం నూతన పాలకమండలి సభ్యులు ఆచార్య పి.చంద్రమతీశంకర్, డా.మాదక్క, పి.ముబీనాబేగం, డాక్టర్ వై.ప్రమోదలు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్యలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైవీయూ విధానపరమైన నిర్ణయాలు తీసుకునే అత్యున్నత పాలకమండలిలో పని చేసే అవకాశం లభించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు వీసీ ఆచార్య అర్జుల రామచంద్రారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, అల్ హబీబా కళాశాల కరస్పాండెంట్ పి.అక్బర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


వైవీయూ అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన పాలకమండలి సభ్యులు

2023-24 ఎస్‌జీఎఫ్ షెడ్యూల్ విడుదల

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో 2023–24 సంవత్సరంలో పాఠశాల క్రీడలకు సంబంధించిన షెడ్యూల్‌ను స్కూల్ గేమ్స్ కార్యదర్శి అరుణ కుమారి, డీఈఓ రాఘవరెడ్డి శుక్రవారం విడుదల చేశారు. సెప్టెంబర్ 2వతేదీ నుంచి 10వతేదీ వరకు ఆయా మండలాల్లో అండర్–14, అండర్–17 బాయ్స్, గర్ల్స్‌కు సంబంధించిన టోర్నమెంట్ మరియు సెలెక్షన్స్ మండల కో ఆర్డినేటర్లు నిర్వహించాలని సూచించారు. 11వతేదీ నుంచి 20వతేదీ వరకు ఆయా నియోజకవర్గాల్లో, అనంతరం 21వతేదీ నుంచి అక్టోబర్ 15వ తేదీ వరకు జిల్లాస్థాయిలోనూ పోటీలు ఉంటాయన్నారు.

వరకట్నం వేధింపులతో యువతి ఆత్మహత్య


సుమతి(ఫైల్)

బద్వేలు అర్బన్ : అదనపు కట్నం తేవాలంటూ భర్త పెట్టే వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బద్వేల్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల ఫిర్యాదు మేరకు సి.కె.దిన్నె మండలం శివాజీ నగర్‌కు చెందిన సుబ్బయ్య, ఇందిరమ్మ దంపతుల కుమార్తె పోలుసుమతి(24)ని పట్టణంలోని రిక్షా కాలనీకి చెందిన బాలుడు అనే యువకుడికి ఇచ్చి ఐదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అన్యోన్యంగా సాగిన వీరి కాపురంలో ఇటీవల మనస్పర్థలు పెరిగాయి. అదనపు కట్నం తేవాలని తరచూ భర్త బాలుడు వేధించడమేగాక, గురువారం రాత్రి సుమతితో గొడవ పడ్డాడు. మనస్తాపానికి గురైన ఆమె అర్ధరాత్రి సమయంలో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న అర్బన్ సీఐ యుగంధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి తండ్రి సుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

మద్యం బాబును బతికించిన ఫోన్


జోసెఫ్‌తో ప్రొద్దుటూరు పోలీసులు దామోదర్, గురుశేఖర్

ప్రొద్దుటూరు క్రైం : మొబైల్ ఫోన్‌తో ఎక్కువ సమయం గడిపితే.. ఆరోగ్యం పాడవుతుందని వైద్యులు చెబుతారు. ఇందుకు భిన్నంగా కాల్వలో పడిపోయిన మద్యంబాబు ప్రాణాలు కాపాడింది సెల్‌ఫోన్. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన జోసెఫ్ ప్రొద్దుటూరులో వివాహం చేసుకున్నారు. కొంత కాలంగా మోడంపల్లెలో నివాసముంటున్నారు. శుక్రవారం మద్యం తాగి ఆ మత్తులో రైల్వే స్టేషన్ సమీపంలోని మురుగు కాలువలో పడిపోయారు. అతడు కనిపించలేదని టూటౌన్ సీఐ ఇబ్రహీంకు బంధువులు ఫిర్యాదు చేశారు. అతడి వద్ద సెల్‌ఫోన్ ఉందని చెప్పడంతో లోకేషన్ గుర్తించి గాలించారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్లు తెలిసి సీఐ ఇబ్రహీం హుటాహుటిన కానిస్టేబుళ్లు దామోదర్, గురుశేఖర్‌లను పంపి స్థానికుల సాయంతో బయటికి తీయించారు. అర్ధరాత్రి సమయంలో ప్రొద్దుటూరుకు తీసుకువచ్చి వైద్యం అందించిన తర్వాత కౌన్సిలింగ్ నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గిరిజనులకు చోటు చరిత్రాత్మకం


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం నాయకులు

కడప కార్పొరేషన్ : తిరుమల, తిరుపతి దేవస్థానం పాలక మండలిలో గిరిజనులకు స్థానం కల్పించడం చరిత్రాత్మకమని వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయక్, వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా.శివానాయక్ తెలిపారు. టీటీడీ పాలక మండలి సభ్యుడిగా అనంతపురానికి చెందిన ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మాజీ కార్యదర్శి చందే అశ్వర్థనాయక్‌ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ టీటీడీ చరిత్రలో తొలిసారి గిరిజనులకు స్థానం కల్పించడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే సాధ్యమైందని అన్నారు. రూ.800 కోట్లతో గిరిజన విశ్వ విద్యాలయం, అరకులో గిరిజన వైద్య కళాశాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ నగర అధ్యక్షుడు కె.వెంకటరమణ, జగన్ రాథోడ్, దండుబాబు, అర్జున్‌నాయక్, రమేష్, గోపీనాయక్, పవన్ నాయక్, రాజేష్, బీడీ నాయక్, కేశవ పాల్గొన్నారు.

యర్రగుంట్ల జడ్పీ పాఠశాలను తీర్చిదిద్దుతాం

సర్వశిక్ష అభియాన్ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలను తీర్చిదిద్దుతామని సర్వశిక్ష అభియాన్ పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 'నాడు–నేడు' పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో చదివి సీఎస్.జవహర్‌రెడ్డి ఉన్నత స్థాయికి చేరారన్నారు. విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామని, అదనపు తరగతి గదులు నిర్మించి అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, ఎంఈఓ శివప్రసాద్, వెంకటేశ్వర్లు, ఏఈ రామాంజనేయులు, చంద్ర ఓబుళరెడ్డి, ఏఈ సురేష్ పాల్గొన్నారు.


తరగతి గదులను పరిశీలిస్తున్న పీఓ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కార్మికులు అవగాహన పెంచుకోవాలి


కార్మికులతో మాట్లాడుతున్న కార్మికశాఖ సహాయ కమీషనర్ శ్రీనివాస్

కడప అర్బన్ : జిల్లాలో అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులు ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి వుండాలని కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్ తెలియజేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు అసంఘటిత రంగంలోని కార్మికులకు 'న్యాయసేవలు పథకం–2015, ఈ–శ్రమ కార్డులు' అంశంపై సంధ్యా సర్కిల్, రైతు బజార్ వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు బీమా, ఆయుష్మాన్ భారత్, పీఎం స్వనిధి, మొదలగు అంశాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారులు శ్రీనివాస రెడ్డి, పాల్ జాన్సన్, ఎన్జీవోలు సురేష్ సహాయం, జిలానీబాష పాల్గొన్నారు.

ప్రతి భారతీయుడికీ పాలసీ ఇవ్వాలన్నదే లక్ష్యం


లోగోను ఆవిష్కరిస్తున్న ఎస్‌డీఎం గిరిధర్, ఇతర అధికారులు

ఎల్‌ఐసీ ఎస్‌డీఎం.గిరిధర్

కడప కల్చరల్ : ప్రతి భారతీయుడికి ఒక ఎల్‌ఐసీ పాలసీ అందివ్వాలన్నదే తమ లక్ష్యమని, ఇందుకోసం 13 లక్షల మంది ఏజెంట్లు, 98 వేల మంది సిబ్బంది పనిచేస్తున్నారని ఎల్‌ఐసీ కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.గిరిధర్ అన్నారు. కడప డివిజనల్ కార్యాలయం ఆవరణలో బీమా వారోత్సవాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్సూరెన్స్ వ్యాపారంలో ఎల్‌ఐసీ మార్కెట్ లీడర్‌గా కొనసాగుతోందన్నారు. 2023 జూన్, 30 నాటికి ఎల్‌ఐసీ రూ.46 లక్షల కోట్ల ఆస్తులు కలిగి ఉందని, రూ.9543 కోట్ల లాభాలు సాధించిందని తెలిపారు. మార్కెటింగ్ మేనేజర్ శ్యామ్‌సుందర్ రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1న ప్రారంభమయ్యే బీమా వారోత్సవాలు 7న ముగుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు సత్యశ్రీనివాస్, సత్యప్రసాద్, ఆనందరావు, యల్లారెడ్డి, సంజయ్, రఘునాథరెడ్డి, సుధీకర్, రెడ్డిభాస్కర్, జయభారతరెడ్డి, అధికారులు లక్ష్మీనారాయణ రెడ్డి, రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

చీనీ సూట్ ధరలపై అవగాహన


మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ కమీషనర్

సింహాద్రిపురం : మండలంలోని గురజాల గ్రామంలో శుక్రవారం చీనీ రైతులు, వ్యాపారులకు చీనీ సూట్ ధరలపై అవగాహన కల్పించారు. మార్కెటింగ్ కమిషనర్ రాహుల్‌పాండే మాట్లాడుతూ కడప ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి చొరవతో పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం, తొండూరు, లింగాల, వేముల మండలాల్లో 15 రైతు భరోసా కేంద్రాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకున్నామని తెలిపారు. చీనీ సూట్‌ను శాశ్వతంగా నిర్మూలించే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో ఎవరైనా వ్యాపారులు రైతులకు సరైన మద్దతు ధర ఇవ్వకపోయినా, చీనీ పంటలో సూట్ తీసుకునా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెటింగ్ శాఖ జేడీ రాజశేఖర్, పులివెందుల, సింహాద్రిపురం మార్కెట్ చైర్మన్లు చిన్నప్ప, రామ్మోహన్ రెడ్డి, బోర్డు సభ్యుడు శివ, ప్రసాద్‌రెడ్డి, డీహెచ్‌ఓ మైఖేల్ రాజీవ్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యేపై దుర్భాషలాడిన వ్యక్తిపై కేసు


వెంకటేశ్వరరెడ్డి

బి.కొత్తకోట : సీఎం, స్థానిక ఎమ్మెల్యేలను దుర్భాషలాడిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కే.రామమోహన్ తెలిపారు. సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామంలోకి వెళ్తున్న అధికారులను అడ్డుకోవడమేకాక సీఎం, ఎమ్మెల్యేపై నోరుపారేసుకున్న వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు.. బి.కొత్తకోట మండలం నాయనబావి పంచాయతీ దేవరాజుపల్లెలో గడప గడప మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓ శంకరయ్య సహా అధికారులు, సచివాలయ సిబ్బంది దేవరాజుపల్లెకు వెళ్లగా ఆ గ్రామస్తుడు ఎస్.వెంకటేశ్వరరెడ్డి అధికారుల వద్దకు వచ్చాడు. మాగ్రామంలోకి మిమ్మల్ని ఎవరు రమ్మన్నారని అధికారులను అడ్డుకుని వారిపై దుర్భాషలాడాడు. సీఎం, ఎమ్మెల్యేను తిడుతూ మా ఊరిలోకి రావొద్దని అడ్డుకుని విధులకు ఆటకం కలిగించాడు. పంచాయతీ కార్యదర్శి మధుకర్‌రెడ్డి తాను పంచాయతీ కార్యదర్శి అని సర్ది చెప్పినా వినకుండా గ్రామంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నాడు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ మధుకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసి నిందితున్ని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

పెద్దముడియం : మండలంలోని కాకిరేనిపల్లె గ్రామం నుండి పర్లపాడు గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాకర్లను ఉలవపల్లె వీఆర్వో ఈశ్వరయ్య పట్టుకుని ఎస్ఈబీ ఎస్‌ఐ సరస్వతికి అప్పగించారు. ఆమె ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేల జరిమానా విధించి ట్రాక్టర్లను వదలిపెట్టినట్లు తెలిపారు.

గుట్టపై నుంచి జారిపడ్డ గుండు


కింద పడిన గుండు

వాల్మీకిపురం : వాల్మీకిపురం–నిమ్మనపల్లి మార్గంలోని బూడిదగుట్ట ప్రాంతంలో గుట్టపై నుంచి ఒక పెద్ద గుండు భీకర శబ్దంతో జారి పడింది. టమోటా తోట వద్దకు వెళ్లి వస్తున్న రైతు షేక్ రహంతుల్లాకు రెప్పపాటులో ఒక రైతుకు ప్రమాదం తప్పింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతి చెందిన శాంతి

మైదుకూరు : మైదుకూరు మండలం బసవాపురం ఎస్సీ కాలనీలో కటారి శాంతి(20) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. దువ్వూరు మండలం మాచనపల్లె గ్రామానికి చెందిన శాంతిని మైదుకూరు మండలం బసవాపురం ఎస్సీ కాలనీకి చెందిన కటారి చెన్నయ్య ఏడాదిన్నర కిందట ప్రేమ వివాహం చేశారు. వీరిరువురు బంధువులే అయినా పెళ్లి తర్వాత శాంతికి పుట్టింటితో రాకపోకలు లేవు. అయితే ఇటీవల శాంతి, భర్త కుటుంబీకులకు మధ్య వివాదం జరగడంతో శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. తన బిడ్డను అత్త, భర్త చంపి ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారని తల్లి మార్తమ్మ మైదుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైదుకూరు తహసీల్దార్ అనురాధ, శాంతి మృతదేహాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఏఎస్‌ఐ పాండురంగారెడ్డి తెలిపారు.

రోజూ 55 కిలోల పూల సరఫరా

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో పూలు సరఫరా చేసేందుకు శుక్రవారం టెండర్ నిర్వహించినట్లు టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు తెలిపారు. కోదండ రామాలయం ఆవరణలోని పరిపాలనా భవనంలో పూల టెండర్ కార్యక్రమం నిర్వహించగా ముగ్గురు పాల్గొన్నారు. కడప జిల్లా, చక్రాయపేట మండలం కుప్పం గ్రామానికి చెందిన ఆర్.రామచంద్రారెడ్డి టెండర్ దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ వెంకటేశయ్య, ఏఈ కళావతి, ఆలయ ఇన్స్‌పెక్టర్ ధనుంజయుడు పాల్గొన్నారు.

నలుగురికి అస్వస్థత

తంబళ్లపల్లె : మండలంలోని కోటకొండ పంచాయతీ కురవపల్లెలో నలుగురు విరోచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. గ్రామానికి చెందిన ఆదినారాయణ(45), నాగమ్మ(80), మల్లమ్మ(60)లు తీవ్ర అసవస్థతకు గురై మదనపల్లె ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నాగమల్లమ్మ(64) మదనపల్లె ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అస్వస్థతకు గురైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి స్పందించి శిబిరం ఏర్పాటు చేయాలని సూచించడంతో డాక్టర్ అనుపమ, మునికుమార్, సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. బోరు సమీపంలో మురుగు కాల్వ ఉండడం, పైపులైన్‌కు లీకేజీ ఏర్పడడం విరోచనాలకు కారణమై ఉండవచ్చునని వారు తెలిపారు.

ఇరు వర్గాల ఘర్షణ

సంబేపల్లి : మండలంలోని శెట్టిపల్లి పంచాయతీ బుర్రవాండ్లపల్లెలో శుక్రవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు గ్రామంలోని వ్యవసాయ బోరు పైపులైన్ విషయంపై ఇరువర్గాల మాటా మాటా పెరిగి ఘర్షణ వాతావరణం చోటుచేసుకోవడంతో దాడులు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం బాధితులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి బిజినెస్
శనివారం
2-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	556	65,387
నిఫ్టీ ▲	182	19,435

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	14,010	▽	25
డోజోన్స్	34,782	▲	60
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,465	▲	25
డాక్స్	15,840	▽	107
షాంఘై	3,133	▲	13
నికాయ్	32,713	▲	91

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,489	▲	4
బంగారం (99.5 స్వచ్ఛత)	59,251	▲	4
వెండి (కిలో)	74,838	▽	193

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎకటం	81.63	83.50
£	బ్రిటన్ పౌండ్	ఎకటం	103.01	106.40
€	యూరో	ఎకటం	88.08	91.20
¥	జపాన్ ఎన్ (100)	ఎకటం	55.95	57.72
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎకటం	52.41	54.75
S$	సింగపూర్ డాలర్	ఎకటం	60.21	62.17
SAR	సౌదీ రియాల్	ఖావపరుక	21.10	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	ఖావపరుక	21.62	23.42
¥	చైనా యువాన్	ఖావపరుక	10.28	12.35

జీఎస్‌టీ వసూళ్లు 11 శాతం అప్

ఆగస్టులో రూ.1,59,069 కోట్లు



న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు 2023 ఆగస్టులో గత ఏడాది ఇదే నెలతో పోల్చితే 11 శాతం పెరిగి రూ.1.59 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. అధికారిక గణాంకాలను పరిశీలిస్తే..

- మొత్తం వసూళ్లు రూ.1,59,069 కోట్లు.
- సెంట్రల్ జీఎస్‌టీ వాటా రూ.28,328 కోట్లు.
- ఎస్‌జీఎస్‌టీ వసూళ్లు రూ.35,794 కోట్లు.
- ఇంటిగ్రేటెడ్ జీఎస్‌టీ రూ.83,251 కోట్లు.
- సెస్ రూ.11,696 కోట్లు.

ఆర్థిక సంవత్సరంలో తీరిది...
ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్లో చరిత్రాత్మక స్థాయిలో రూ.1.87 లక్షల కోట్ల అత్యధిక వసూళ్లు నమోదయ్యాయి. మే, జూన్‌లో వరుసగా రూ.1.57 లక్షల కోట్లు, రూ.1.61 లక్షల కోట్లు ఒనగూరాయి.

గ్రీస్‌లో జీఎంఆర్ మరిన్ని పెట్టుబడులు



ముంబై: గ్రీస్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తున్న దేశీ దిగ్గజం జీఎంఆర్ గ్రూప్.. ఆ దేశంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే యోచనలో ఉంది. కెలమాటా ఎయిర్‌పోర్ట్‌లో ఇన్వెస్ట్ చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ప్రస్తుతం జీఈకే టెర్నా సంస్థతో కలిసి గ్రీస్‌లోని క్రైటె ప్రాంతంలో హెరాక్లియోన్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎంఆర్ గ్రూప్ తెలిపింది. హెరాక్లియోన్ విమానాశ్రయ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఇంధన, అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్స్ వ్యాపార విభాగం చైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల తెలిపారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనలో భాగంగా గ్రీస్ ప్రధాన మంత్రి నిర్వహించిన విందులో శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. భారత్, గ్రీస్ మధ్య కనెక్టివిటీ మెరుగుపడితే ఇరు దేశాల స్థూల దేశీయోత్పత్తి వృద్ధికి, వ్యాపార అవకాశాల కల్పనకు తోడ్పడగలదని ఆయన పేర్కొన్నారు.

93 శాతం 2,000 నోట్లు వెనక్కు వచ్చేశాయ్: ఆర్‌బీఐ

ముంబై: ఉపసంహరణ నిర్ణయం వెలువడిన మే 19వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 93 శాతం తిరిగి వచ్చేశాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రకటన ఒకటి పేర్కొంది. ఆర్‌బీఐ ప్రకటన ప్రకారం, ఆగస్టు 31వ తేదీ నాటికి చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్ల విలువ రూ.0.24 లక్షల కోట్లకు పడిపోయింది. బ్యాంకులకు తిరిగి వచ్చిన నోట్లలో 87 శాతం డిపాజిట్ల రూపంలో జరగ్గా, 13 శాతం బ్యాంకుల్లో ఇతర కరెన్సీలోకి మార్పిడి ద్వారా వెనక్కువచ్చాయి. అధిక విలువ నోట్లు కలిగి ఉన్న ప్రజలు 2023 సెప్టెంబరు 30 నాటికి ఆ నోట్లను డిపాజిట్ చేయాలని లేదా నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆర్‌బీఐ సూచించింది. 2016 నవంబర్లో రూ.500, రూ.1,000 నోట్లను రద్దుచేసి కొత్త రూ.500, రూ.2,000 నోట్లను తీసుకువచ్చిన ఆర్‌బీఐ, మే 19వ తేదీన ఒక కీలక ప్రకటన చేస్తూ, రూ.2,000 నోట్లను కూడా సెప్టెంబర్ 30 నాటికి పూర్తిగా వెనక్కు తీసుకుంటున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. నిజానికి 2018-19లోనే ఆర్‌బీఐ రూ. 2,000 నోట్ల ముద్రణను నిలిపివేసింది. 2018 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల గరిష్ట



చెలామణీ విలువ రూ.6.73 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం రూ.2,000 నోట్లలో ఈ విలువ 37.3 శాతానికి సమానం. 2023 మార్చి 31వ తేదీ నాటికి రూ.2,000 నోట్ల చెలామణీ విలువ రూ.3.62 లక్షల కోట్లు. చెలామణీలో ఉన్న మొత్తం నోట్లలో ఈ విలువ 10.8% మాత్రమే. వ్యవ స్థలో 2,000 నోట్ల వినియోగం ఇంధనం, బంగారు ఆభరణాలు, కిరాణా కొనుగోళ్లకు అధికంగా వినియోగిస్తున్నట్లు ఇప్పటికే పలు సర్వేలు వెల్లడించాయి.

ఎయిర్ ఇండియా-విస్తారా విలీనానికి గ్రీన్ సిగ్నల్

కాంపిటీషన్ కమిషన్ ఆమోదముద్ర



న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా-విస్తారా విలీనబాటలో కీలక అడుగు పడింది. కొన్ని షరతులకు లోబడి ఎయిర్ ఇండియా-విస్తారా ప్రతిపాదిత విలీనాన్ని కాంపిటీషన్ కమిషన్ శుక్రవారం ఆమోదించింది. తన విమానయాన వ్యాపారాన్ని ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి సంబంధించి టాటా గ్రూప్‌కు ఇది ఒక ప్రధాన ముందడుగు. ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' పై చేసిన ఒక పోస్టింగ్‌లో విలీనానికి ఆమోదముద్ర వేసినట్లు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) తెలిపింది. ''ఎయిరిండియాలో టాటా ఎస్ఐఏ ఎయిర్‌లైన్స్ విలీనానికి సీసీఐ ఆమోదం తెలిపింది. పార్టీలు అందించే స్వచ్ఛంద కట్టుబాట్లకు, విధి విధానాలకు లోబడి ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ నిర్దిష్ట వాటాలను కొనుగోలు చేస్తుంది' అని సీసీఐ పేర్కొంది. విస్తారా, ఎయిర్ ఇండియా టాటా గ్రూప్‌లో భాగంగా ఉన్న రెండు వేర్వేరు విమానయాన సంస్థలు. సింగపూర్ ఎయిర్‌లైన్స్‌కు విస్తారాలో 49% వాటా ఉంటే, టాటా సన్స్ వాటా 51%గా ఉంది. ఎయిరిండియాలో 25.1% వాటాను సింగపూర్ ఎయిర్‌లైన్స్ కొనుగోలు చేయనున్న ఒప్పందం ప్రకారం విస్తారాను ఎయిర్ ఇండియాతో విలీనం చేస్తున్నట్లు గతేడాది నవంబర్‌లో టాటా గ్రూప్ ప్రకటించింది.


ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో వార్‌బర్గ్ పింకస్ వాటా విక్రయం



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అమెరికన్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ వార్‌బర్గ్ పింకస్ 4.2 శాతం వాటాలను ఓపెన్ మార్కెట్ లావాదేవీ ద్వారా విక్రయించింది. వీటి విలువ రూ. 2,480 కోట్లు. బీఎస్‌ఈ డేటా ప్రకారం వార్‌బర్గ్ పింకస్ అనుబంధ సంస్థ క్లోవర్‌డెల్ ఇన్వెస్ట్‌మెంట్ 27.86 కోట్ల షేర్లను (4.2 శాతం) వాటాలను షేరు ఒక్కింటికి రూ. 89 రేటుతో విక్రయించింది. జూన్ ఆఖరు నాటి గణాంకాల ప్రకారం ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో అనుబంధ సంస్థల ద్వారా వార్‌బర్గ్ పింకస్‌కు 8.5 శాతం వాటాలు ఉన్నాయి.

కోవర్టు లాబీయింగ్ చేశాయి

- పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకున్నాయి
- అనిల్ అగర్వాల్ సంస్థలను టార్గెట్ చేసిన ఓసీసీఆర్‌పీ
- వేదాంత, కెయిర్న్‌పై ఆరోపణలు



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ప్రమోటర్లపై ఆరోపణలు గుప్పించిన ఓసీసీఆర్‌పీ తాజాగా పారిశ్రామిక దిగ్గజం అనిల్ అగర్వాల్‌కి చెందిన కంపెనీలు వేదాంత, కెయిర్న్ ఇండియాను టార్గెట్ చేసింది. పర్యావరణ చట్టాలను అనుకూలంగా మార్చుకునేందుకు వేదాంత కోవర్టు లాబీయింగ్ నడిపినట్లు కొత్తగా మరో నివేదికలో ఆరోపించింది. ప్రభుత్వం కూడా ప్రజలను సంప్రదించకుండా నిబంధనల మార్పులను ఆమోదించి, 'అక్రమ పద్ధతుల్లో' అమలు చేసినట్లు పేర్కొంది. ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు (ఓసీసీఆర్‌పీ) విడుదల చేసిన నివేదికలోని కొన్ని ప్రధానాంశాలు..

- కొత్తగా పర్యావరణ అనుమతుల అవసరం లేకుండా దేశీయంగా ఉత్పత్తిని 50% వరకు పెంచుకునేందుకు మైనింగ్ కంపెనీలకు అనుమతినిస్తే ఆర్థిక వ్యవస్థ రికవరీ మరింత వేగవంతం కాగలదని 2021 జనవరిలో వేదాంత గ్రూప్ చైర్మన్ అనిల్ అగర్వాల్ అప్పటి పర్యావరణ శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్‌కు లేఖ రాశారు.
- ''2022 తొలినాళ్లలో పలు దఫాల సమావేశాల అనంతరం పర్యావరణ శాఖ నిబంధనలను సడలించింది. ప్రజాభిప్రాయాల సేకరణ నిర్వహించాల్సిన అవసరం లేకుండా మైనింగ్ కంపెనీలు 50 శాతం వరకు ఉత్పత్తిని పెంచుకునేందుకు అనుమతించింది'' అని ఓసీసీఆర్‌పీ తెలిపింది.
- వేదాంత తరహాలోనే దాని అనుబంధ సంస్థ కెయిర్న్ ఆయిల్ అండ్ గ్యాస్ కూడా వ్యవహరించింది. చమురు అన్వేషణ ప్రాజెక్టుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ నిబంధనను ఎత్తివేసేందుకు లాబీయింగ్ చేసింది.
- అధికార బీజేపీకి వేదాంత గణనీయంగా విరాళాలు కూడా ఇచ్చినట్లు (2016-2020 మధ్య కాలంలో రూ.43.5 కోట్లు) ఆధారాలు ఉన్నాయని ఓసీసీఆర్‌పీ తెలిపింది.

వేదాంత స్పందన ఇదీ..
ఓసీసీఆర్‌పీ ఆరోపణలను నిర్దుష్టంగా ఖండించకుండా వేదాంత స్పందించింది. 'దిగుమతులకు ప్రత్యామ్నాయంగా పర్యావరణానికి అనుకూలమైన విధానాల్లో దేశీయంగా ఉత్పత్తిని పెంచాలనేది మా లక్ష్యం. దానికి అనుగుణంగా దేశాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, సహజ వనరుల విషయంలో భారత్ స్వావలంబన సాధించడంలో తోడ్పాటు అందించే ఉద్దేశంతో ప్రభుత్వ పరిశీలన కోసం పలు విజ్ఞప్తులు చేశాము' అని సంస్థ అధికార ప్రతినిధి తెలిపారు.

ఆగస్ట్‌లో ఆల్‌టైమ్ 'రయ్'!

న్యూఢిల్లీ: దేశీయ ప్యాసింజర్ వాహన అమ్మకాలు ఆగస్టులో ఆల్‌టైం గరిష్టానికి చేరుకున్నాయి. ఎస్‌యూవీ(స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్)లకు డిమాండ్ కొనసాగడం, పండుగ సీజన్ మొదలవడంతో గిరాకీ పుంజుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. మారుతీ సుజుకీ రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిపింది. మొత్తం 1,89,082 వాహనాలు విక్రయించింది. గతేడాది ఇదే నెల అమ్మకాలు 1,65,173 యూనిట్లతో పోలిస్తే 14% అధికం. హ్యుందాయ్, ఎంఅండ్ఎం, టయోటా కిర్లోస్కర్ కంపెనీలు అమ్మకాల్లో రెండంకెల వృద్ధిని సాధించాయి. టాటా మోటార్స్, హోండా కార్స్ విక్రయాల్లో స్వల్ప క్షీణత నమోదైంది. ద్విచక్ర వాహన విభాగంలో బజాజ్ ఆటో విక్రయాలు 15% తగ్గాయి. హీరో మోటో



కార్ప్, టీవీఎస్ మోటార్స్ అమ్మకాలు వరుసగా 6%, 4% పెరిగాయి. వాణిజ్య వాహనాలు, ట్రాకర్ల అమ్మకాలు కూడా గణనీయంగా పెరిగాయి.

ఆగస్ట్ వాహన అమ్మకాల తీరు..

	2023	2022	వృద్ధి(%)
మారుతీ	1,89,082	1,65,173	(+)14
హ్యుందాయ్	71,435	62,210	(+)15
టాటా మోటార్స్	78,010	78,843	(-)1
ఎండ్ అండ్ ఎం	70,350	59,049	(+)19
హోండా కార్స్	7,880	7,769	(+)1
ఎంజీ మోటార్స్	4,185	3,823	(+)9
టయోటా	22,910	14,959	(+)53
ద్విచక్ర వాహనాలు			
బజాజ్ ఆటో	3,41,648	4,01,595	(-)15
హీరో మోటో	4,88,717	4,62,608	(+)6
టీవీఎస్	3,45,848	3,33,787	(+)4
రాయల్ ఎన్‌ఫీల్డ్	77,583	70,112	(+)11
వాణిజ్య వాహనాలు			
వోల్వో ఐషర్	6,476	5,003	(+)29
అశోక్ లేలాండ్	15,576	14,121	(+)10
ట్రాక్టర్లు			
ఎస్కార్ట్స్	5,198	5,308	(+)2
మహీంద్రా	21,676	21,520	(+)1

రెండు నెలల్లో అతిపెద్ద లాభం

- మెప్పించిన స్థూల ఆర్థిక గణాంకాలు
- సెన్సెక్స్ లాభం 556 పాయింట్లు
- 19,400 స్థాయి పైకి నిఫ్టీ



ముంబై: స్థూల ఆర్థిక గణాంకాలు మెప్పించడంతో పాటు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు కలిసిరావడంతో శుక్రవారం స్టాక్ సూచీలు ఒక శాతం మేర ర్యాలీ చేశాయి. సెన్సెక్స్ 556 పాయింట్లు పెరిగి 65,387 వద్ద నిలిచింది. నిఫ్టీ 182 పాయింట్లు బలపడి 19,435 వద్ద స్థిరపడింది. వెరసి గడిచిన రెండు నెలల్లో అతిపెద్ద లాభాన్ని గడించాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచీ ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గుచూపారు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లూ రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 642 పాయింట్లు దూసుకెళ్లి 65,473 వద్ద, నిఫ్టీ 205 పాయింట్లు ఎగసి 19,459 వద్ద ఇంట్రాడే గరిష్టాలను నమోదు చేశాయి. మెటల్, ఆయిల్‌అండ్‌గ్యాస్, బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి ప్రాతినిధ్యం వహించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.488 కోట్లు, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,295 కోట్ల ఈక్విటీలు కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 500 పాయింట్లు, నిఫ్టీ 169 పాయింట్లు లాభపడ్డాయి. కాగా, సెన్సెక్స్ భారీ ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.312.33 లక్షల కోట్లు ఎగబాకింది.

సాక్షి స్పోర్ట్స్

అంతర్జాతీయ క్రికెట్ ఆడనున్న తొలి 'ట్రాన్స్‌జెండర్'గా డానిల్ మెక్‌గహే

అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి 'ట్రాన్స్‌జెండర్' బరిలోకి దిగనుంది. లింగ మార్పిడి చేసుకున్న కెనడాకు చెందిన 29 ఏళ్ల డానిల్ మెక్‌గహే ఇప్పుడు మహిళల జట్టు తరఫున క్రికెట్ ఆడుతుంది. అమెరికన్ క్వాలిఫయర్ టోర్నీలో పాల్గొనే కెనడా టి20 జట్టులో ఆమెకు చోటు లభించింది. ఆస్ట్రేలియాలో పుట్టిన ఆమె కెనడాకు వలస వచ్చింది. 2020లో పురుషుడి నుంచి స్త్రీగా మారేందుకు సిద్ధమైన ఆమె 2021లో వైద్యపరంగా పూర్తి స్థాయిలో మహిళగా మారింది. ట్రాన్స్‌జెండర్‌లు అంతర్జాతీయ మ్యాచ్ ఆడేందుకు ఐసీసీ నిర్దేశించిన అర్హత ప్రమాణాలను ఆమె ఇటీవలే అందుకుంది. 'ట్రాన్స్‌జెండర్‌ను మహిళగా గుర్తించాలంటే వరుసగా 12 నెలల పాటు టెస్టోస్టిరాన్ లెవల్ 5 నానోమోల్/లీటర్‌కంటే తక్కువగా ఉండాలి' అనేది ఐసీసీ నిబంధన.



నీరజ్‌కు రెండో స్థానం

జ్యూరిచ్ డైమండ్ లీగ్ మీట్

జ్యూరిచ్ (స్విట్జర్లాండ్): భారత స్టార్ అథ్లెట్, వరల్డ్ చాంపియన్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ మీట్‌లో కాస్త తడబడ్డాడు. ఈ సీజన్ లీగ్ నాలుగో మీట్ బరిలోకి దిగిన నీరజ్ రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. జ్యూరిచ్‌లో జరిగిన ఈ పోటీల్లో నీరజ్ 85.71 మీటర్ల దూరం జావెలిన్ విసిరాడు. ఈ ఈవెంట్‌లో జాకబ్ వాల్డెచ్ (చెక్ రిపబ్లిక్ – 85.86 మీటర్లు) అగ్రస్థానం సాధించగా... జూలియస్ వెబర్ (జర్మనీ – 85.04 మీటర్లు) మూడో స్థానంలో నిలిచాడు. నీరజ్ విసిరిన ఆరు త్రో లలో 80.79 మీ., 85.22 మీ., 85.71 మీ. దూరాలు నమోదు చేయగా మరో మూడు త్రో లు 'ఫౌల్' అయ్యాయి. అయితే మూడు మీట్‌లలో కలిపి 23 పాయింట్లు సాధించడం ద్వారా మూడో స్థానంతో డైమండ్ లీగ్ ఫైనల్ చాంపియన్‌షిప్‌కు నీరజ్ అర్హత సాధించాడు. గత ఏడాది డైమండ్ లీగ్ చాంపియన్ అయిన నీరజ్...ఈ సీజన్‌లో దోహా, లాసానేలలో అగ్రస్థానం సాధించాడు. గాయం కారణంగా అతను మొనాకో మీట్‌లో పాల్గొనలేకపోయాడు. సెప్టెంబర్ 17నుంచి యూగీన్ (అమెరికా)లో ఫైనల్స్ జరుగుతుంది. ఇతర ఫలితాల్లో లాంగ్‌జంప్‌లో మురళీ శంకర్ ఐదో స్థానంలో నిలిచాడు. అతనూ ఫైనల్స్‌కు అర్హత సాధిండంలో సఫలమయ్యాడు.



జ్యూరిచ్‌లో తన ప్రదర్శన పట్ల నీరజ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. వరల్డ్ చాంపియన్‌షిప్ తర్వాత తాను బాగా అలసిపోయానని, కాస్త భుజం నొప్పి కూడా ఇబ్బంది పెట్టిందని నీరజ్ వ్యాఖ్యానించాడు. ఫైనల్స్ సమయానికి తాను 100 శాతం ఫిట్‌గా ఉండాలని కోరుకుంటున్నట్లు అతను చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం నిలబెట్టుకోవడం కూడా తన లక్ష్యమని నీరజ్ వెల్లడించాడు.

నేడే 'ఆసియా' అసలు సమరం

భారత్, పాక్ ఢీకి సిద్ధం
- ఫేవరెట్‌గా రోహిత్ సేన
- నంబర్‌వన్ హోదాతో బాబర్ బృందం
- మ్యాచ్‌కు వానగండం
- మ.గం. 3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



ఆసియా కప్ ట్రోఫీతో గత ఏడాది (2022) భారత, పాకిస్తాన్ కెప్టెన్లు రోహిత్ శర్మ, బాబర్ ఆజమ్ (ఫైల్)

పల్లెకెలె: వన్డే ప్రపంచకప్‌కు ఇంకొన్ని రోజులే ఉంది. మెగా ఈవెంట్‌కు ముందు క్రికెట్ ప్రపంచం ఒళ్లంతా కళ్లు చేసుకునే కీలక మ్యాచ్ నేడు జరుగనుంది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాకిస్తాన్ జట్లు సై అంటే సై అనే పోరుకు ఆసియా కప్ వన్డే టోర్నీ వేదికైంది. నంబర్‌వన్ పాక్, ఆసియా కప్ ఫేవరెట్ భారత్ మధ్య జరగబోయే ఈ పోరు టోర్నీకే హైలైట్‌గా నిలవడం ఈపాటికే ఖాయమైంది. కేవలం వన్డే ఫార్మాట్‌నే చూసుకుంటే గత వన్డే ప్రపంచకప్ తర్వాత ఇరు జట్లు తలపడే 50 ఓవర్ల పోటీ ఇదే! గతేడాది జరిగిన టి20 వరల్డ్‌కప్‌లో విరాట్ అద్భుత ప్రదర్శన తర్వాత ఇరు జట్లు ఇప్పుడు తలపడుతున్నాయి. మెల్‌బోర్న్ తరహాలో లంక గడ్డపై కూడా మరో హోరాహోరీ ఖాయం.

కొత్త ఉత్సాహంతో రోహిత్ బృందం
గత కొన్నాళ్లుగా స్వదేశంలో జరిగే ప్రపంచకప్ కోసం భారత్ చాలా ప్రయోగాలు చేసింది. రాహుల్, అయ్యర్, బుమ్రావంటి కీలక ఆటగాళ్ల గాయాల నేపథ్యంలో భారత టీమ్ మేనేజ్‌మెంట్ తగిన జాగ్రత్తలు తీసుకొని సీనియర్లు రోహిత్, కోహ్లిలకు బాగా విశ్రాంతినిస్తూ కాపాడుకుంటూ వచ్చింది. ఇక సమయం, సందర్భం రావడంతో టీమిండియా తురుపుముక్కలు బరిలోకి దిగుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది కచ్చితంగా 'ప్రి ప్రపంచకప్' పోటీనే! ఇందులో ఏ సందేహం లేదు. దాదాపు వరల్డ్‌కప్‌లో బరిలోకి దిగే జట్టును ఖాయం చేసేందుకు ఈ ఆసియా టోర్నీని జట్టు వాడుకుంటోంది. రోహిత్, కోహ్లిల ఫిట్‌నెస్, జట్టులోకి అనుభవజ్ఞుడైన ఆల్‌రౌండర్ జడేజా పునరాగమనం, మరో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, బౌలింగ్ దళపతి బుమ్రా, 'హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్' సిరాజ్ ఇలా చెప్పుకుంటూ పోతే భారత్ పూర్తి స్థాయి ప్రపంచకప్ సైన్యంతో రంగంలోకి దిగుతోంది. దీన్నిబట్టి చూస్తే పాక్ పనిపట్టేందుకు, ఆసియా కప్‌లో ఓడించేందుకు రోహిత్ సేనకు ఏమంత కష్టం కానేకాదు.

పుంజుకున్న బలంతో పాక్
కొంత కాలంగా ఇంటాబయటా నిలకడైన విజయాలు, గట్టి ప్రత్యర్థులను ఓడించిన తీరుతో బాబర్ ఆజమ్ సేన మునుపటి కంటే పుంజుకుంది. బ్యాటింగ్‌లో ఫఖర్-ఇమామ్ ఓపెనింగ్ జోడీ నుంచి ఏడో నంబర్ షాదాబ్ ఖాన్ వరకు బ్యాటింగ్ చేసే సత్తా పాకిస్తాన్ పటిష్టంగా నిలుపుతోంది. బౌలింగ్‌లో పేస్ త్రయం షాహిన్ అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్ ఆరంభంలో వికెట్లు పడగొట్టడంతో సఫలమవుతున్నారు. స్పిన్‌లో షాదాబ్, నవాజ్ సత్తా చాటుతుండటంతో పాకిస్తాన్ భారత్‌కు దీటుగా ఉంది. నంబర్‌వన్ హోదా అదనపు స్థైర్యాన్ని తెచ్చిపెట్టగా... రెట్టించిన ఉత్సాహంతో ప్రత్యర్థిని ఢీకొనేందుకు రెడీగా ఉంది.

గత ఐదు వన్డేల్లో...
భారత్, పాక్‌లు తలపడిన గత ఐదు వన్డేల్లో టీమిండియాదే 4-1తో పైచేయిగా ఉంది. 2017 చాంపియన్స్‌ట్రోఫీలో లీగ్ దశలో గెలిచి తుదిపోరులో భారత్ ఓడింది. 2018 ఆసియాకప్‌లో రెండుసార్లు టీమిండియా గెలిచింది. చివరిసారిగా గత వన్డే ప్రపంచకప్(2019)లోనూ భారత్‌దే గెలుపు.



మైదానంలో విరాట్ కోహ్లి, రవూఫ్ ముచ్చట్లు

పిచ్-వాతావరణం

ఇది కొత్త పిచ్. పక్కాగా దీనికే అనుకూలమని చెప్పలేం. లంక, బంగ్లా మధ్య జరిగినట్లే సీమర్లు, స్పిన్నర్లకు చక్కని చాన్స్! అయితే మ్యాచ్‌కు వాన ముప్పు పొంచివుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాన కురిసే అవకాశముండటంతో మ్యాచ్ మొదలయ్యేందుకు ఆలస్యం కావొచ్చు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), శుబ్‌మన్, కోహ్లి, అయ్యర్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, జడేజా, శార్దుల్ /షమీ, కుల్దీప్, సిరాజ్, బుమ్రా.
పాకిస్తాన్: బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్ జమాన్, ఇమామ్ ఉల్ హక్, రిజ్వాన్, ఆగా సల్మాన్, ఇఫ్తికార్, షాదాబ్‌ఖాన్, నవాజ్, షాహిన్ షా అఫ్రిది, నసీమ్ షా, రవూఫ్.

'విషీ'ని దాటిన గుకేశ్

- 'ఫిడే' ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున నంబర్‌వన్
- 37 ఏళ్ల తర్వాత అగ్రస్థానం కోల్పోయిన ఆనంద్



చెన్నై: 1986 జులై 1... చదరంగ మేధావి విశ్వనాథన్ ఆనంద్ భారత నంబర్‌వన్ ఆటగాడిగా మొదటిసారి గుర్తింపు తెచ్చుకున్న రోజు. నాటినుంచి ఇప్పటి వరకు అతనిదే అగ్ర స్థానం. అతని తర్వాత భారత్‌నుంచి పెద్ద సంఖ్యలో కుర్రాళ్లు సత్తా చాటుతూ వచ్చినా... వారితో పోటీ పడుతూ సత్తా చాటిన ఆనంద్ 37 సంవత్సరాలుగా 'టాప్'లోనే నిలిచాడు. ఒక తరం పాటు ఆటను శాసించి ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన ఆనంద్ ఇప్పుడు తొలిసారి తన భారత నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోయాడు. 17 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్ ఇప్పుడు టాప్ ర్యాంక్‌లోకి వచ్చాడు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) శుక్రవారం అధికారికంగా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ప్రకటించింది. ఇందులో గుకేశ్ 8వ ర్యాంక్‌లో నిలవగా... విశ్వనాథన్ ఆనంద్ 9వ ర్యాంక్‌లో ఉన్నాడు. గుకేశ్ రేటింగ్ 2758 కాగా, ఆనంద్ రేటింగ్ 2754గా ఉంది. ఇటీవల జరిగిన వరల్డ్ కప్ సమయంలోనే 'లైవ్ రేటింగ్'లో ఆనంద్‌ను గుకేశ్ అధిగమించాడు. అయితే ఇప్పుడు 'ఫిడే' ర్యాంకింగ్ ద్వారా అధికారికంగా ఆమోద ముద్ర వేసింది. టాప్-30 ర్యాంకింగ్స్‌లో వీరిద్దరితో పాటు భారత్ నుంచి ఆర్. ప్రజ్ఞానంద (19), విదిత్ గుజరాతీ (27), అర్జున్ ఎరిగైశి (29) ఉండగా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణ 31వ స్థానంలో కొనసాగుతున్నాడు. 12 ఏళ్ల 7 నెలల 17 రోజుల గ్రాండ్‌మాస్టర్‌గా మారిన గుకేశ్ అతి పిన్న వయసులో ఈ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో ఉన్నాడు.

అల్‌కరాజ్, మెద్వెదెవ్ ముందంజ

- ఓటమితో జాన్ ఇస్నర్ రిటైర్
- యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



కుమారుడితో ఇస్నర్

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో వరల్డ్ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)కు రెండో రౌండ్‌లో సునాయాస విజయం దక్కింది. ఈ మ్యాచ్‌లో టాప్ సీడ్ అల్‌కరాజ్ 6-3, 6-1, 7-6 (7/4)తో లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా)ను ఓడించి మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. మూడో సీడ్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) రెండో రౌండ్‌లో 6-2, 6-2, 6-7 (6/8), 6-2తో క్రిస్టోఫర్ కానెల్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. మూడు గ్రాండ్‌స్లామ్‌ల విజేత ఆండీ ముర్రే (బ్రిటన్) ఆట మాత్రం రెండో రౌండ్‌లోనే ముగిసింది. గ్రిగర్ దిమిత్రోవ్ (బల్గేరియా) 6-3, 6-4, 6-1తో ముర్రేను ఇంటి ముఖం పట్టించాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ సబలెంకా (రష్యా) 6-3, 6-2తో జోడీ బురెజ్ (యూకే)ను...9వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-2, 6-2తో ట్రెవిజాన్ (ఇటలీ)ను ఓడించి మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు.

టెన్నిస్ సర్క్యూట్‌లో సుదీర్ఘ మ్యాచ్‌లకు చిరునామాగా నిలిచిన జాన్ ఇస్నర్ (అమెరికా) రెండో రౌండ్‌లో మరో సుదీర్ఘ సమరంలో ఓడి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. 3 గంటల 57 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో అమెరికాకే చెందిన మైకేల్ మో 3-6, 4-6, 7-6 (7/3), 6-4, 7-6 (10/7) స్కోరుతో ఇస్నర్‌ను ఓడించాడు. టెన్నిస్ చరిత్రలో సుదీర్ఘ మ్యాచ్ (11 గంటల 5 నిమిషాల పాటు – నికోలస్ మహుత్‌తో) ఆడిన రికార్డులో ఇస్నర్ భాగం కాగా...అత్యధిక ఏస్‌లు (14,470) కొట్టిన ఘనత కూడా అతని సొంతం. **పురుషుల డబుల్స్‌లో ఇద్దరు భారత ఆటగాళ్ల పోరు తొలి రౌండ్‌లోనే ముగిసింది. యూకీ బాంబ్రీ (భారత్) – డెమోలినర్ (బ్రెజిల్) జోడి 3-6, 5-7తో హ్యూగో నిస్ (మొనాకో) – జిలిన్‌స్కీ (పోలాండ్) చేతిలో... సాకేత్ మైనేని (భారత్) – కరటొసెవ్ (రష్యా) ద్వయం 7-6 (7/4), 3-6, 2-6తో లాస్లో జెరె (సెర్బియా) – హ్యూస్టర్ (స్విట్జర్లాండ్) చేతిలో ఓడారు.**